క్లుప్తంగా

నేటి నుంచి కబడ్డీ టోర్నమెంట్

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం శివారు అడ్డాల పాలెం చొప్పలవారి గ్రూపులో వర్షం కారణంగా రద్దైన కబడ్డీ టోర్నమెంట్ బుధవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్టు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మే డే సందర్భంగా శాంతి యూత్ ఆధ్వర్యాన ఒకటో తేదీ నుంచి ఈ టోర్నమెంట్ ప్రారంభం కావాల్సి ఉంది. సఖినేటిపల్లి, మలికిపురం మండలాల స్థాయి కబడ్డీ టోర్నమెంట్ కోర్టును ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభిస్తారని నిర్వాహకుడు గేదెల జాన్సన్ చెప్పారు. మరిన్ని వివరాలకు మొబైల్ నంబర్ 7993723581 సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

అంబాజీపేట: కాలుష్య నివారణను అరికట్టేందుకు ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని, ఎవరైనా వాడినా, వినియోగించినా వారిపై శాఖాపరమైన చర్యలతో పాటు జరిమానా విధిస్తామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రతి గ్రామంలోను సచివాయల సిబ్బంది షాపులను పరిశీలిస్తారని ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారికి రూ.500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని సహకరించాలని ఆయన కోరారు.

మహిని అభినందించిన ఎస్పీ శ్రీధర్



అమలాపురంలో మహిని అభినందిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ లతామాధురి

పి.గన్నవరం: కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన పర్యావరణ వేత్త, విద్యార్థిని అడబాల మహిని జిల్లా ఎస్పీ సుధీర్ మంగళవారం అభినందించారు. అమలాపురంలోని కార్యాలయంలో ఎస్పీని మహి కలిసింది. పర్యావరణ పరిరక్షణ, ఇంధన వనరులను పొదుపుగా వినియోగించడం, రహదారుల భద్రత, సైబర్ క్రైమ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ వంటి అంశాలపై సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్న మహిని ఎస్పీతో పాటు అడిషనల్ ఏఎస్పీ లతామధురి అభినందించారు. మహి ఇప్పటి వరకూ 200 దిశా యాప్‌లను కూడా ఇతరుల మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేయించింది.

ఆలయాల్లో రవికిరణ్ ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి, పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయాల్లో ఏపీ కోస్టల్ జైల్ డీఐజీ ఎం.రవికిరణ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద ఆలయ ఈఓలు ముదునూరి సత్యనారాయణ రాజు, కృష్ణ చైతన్యల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయంలోకి స్వాగతం పలికారు. ఆలయాల్లో స్వామి వార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా 'దాచూరి' వర్ధంతి

కొత్తపేట: ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, అమరజీవి దాచూరి రామిరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకువెళదామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యెలిశెట్టి మురళి పిలుపునిచ్చారు. రామిరెడ్డి నాలుగో వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక యూటీఎఫ్ హోం వద్ద ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యేడిద సత్తిరాజు, టి.విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విరగ కాసిన మునగ



మొగలికుదురులో విరగకాసిన మునగచెట్టు

మామిడికుదురు: మొగలికుదురు పంటకాలువ పక్కన ఉన్న మునగచెట్టు విరగ కాసింది. ఆ చెట్టుకు వందల సంఖ్యలో కాయలు కాయడం విస్మయ పరుస్తోంది. కేవలం ఒక కొమ్మకు సుమారు వందకు పైగా కాయలు కాయడం అబ్బుర పరుస్తోంది. ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు ఆ మునగ చెట్టును చూసి ఔరా! అని ఆశ్చర్యపోతున్నారు. విరగకాసిన కాయల బరువుకి ఆ మునగ చెట్టు కొమ్మ ఒకటి విరిగిపోవడం ఇక్కడ కొసమెరుపు.

వైభవంగా పార్వతీ మల్లేశ్వరుని కల్యాణం

మామిడికుదురు: మొగలికుదురులో కొలువుదీరిన పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ వైశాఖ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తంలో సోమవారం రాత్రి స్వామి కల్యాణోత్సవాన్ని కడు రమణీయంగా జరిపించారు. పలు రకాల పుష్పాలతో సుందరంగా రూపొందించిన మంటపంలో స్వామి, అమ్మవార్లను కొలువు తీర్చి శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. పలువురు భక్త దంపతులు కల్యాణోత్సవం ఘట్టంలో పాల్గొన్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వామ్మో.. ఊరగాయ..

- ముచ్చెమటలు పట్టిస్తున్న మామిడి, ముడిసరకుల ధర
- వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తగ్గిన దిగుబడులు



మార్కెట్‌లో ఊరగాయ మామిడికాయలు



ఊరగాయలో ఉపయోగించే కారం

ఆలమూరు: తొలకరి జల్లుల నాటికి కారంకారంగా నోరూరించే ఊరగాయలను తయారు చేసుకుని ఇంట్లో నిల్వ చేసుకోవాలన్న తెలుగు లోగిళ్లు ఆ దిశగా సన్నద్ధమవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఎండలు దోబూచులాడటంతో ముందస్తుగానే ఇళ్లల్లో ఊరగాయ తయారీకి ఉవ్విళ్లూరుతున్నారు. ఊరగాయల్లో ఉపయోగించే ముడిసరకుల ధరలు గత ఏడాదితో పోలిస్తే ఈఏడాది రెట్టింపయ్యాయి. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలు ఊరగాయ నిల్వ చేసుకోవడం ఇబ్బందిగా, భారంగాను మారింది. మామిడిపూత సమయంలో విపరీతమైన మంచు కురవడంతో పూత రాలిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. అలాగే ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఎండుమిర్చి, మెంతులు, ఆవాలు, వెల్లుల్లి పంటల దిగుబడి అంతంతమాత్రంగానే ఉండటం, వేరుశెనగ, గానుగనూనెల కొరత వల్ల వాటి ధరలు ఊరగాయ సీజన్ కావడంతో ఒక్కసారిగా అమాంతంగా పెరిగిపోయాయి. చాగల్నాడు, మెట్ట ప్రాంతాల నుంచి పచ్చళ్ల తయారీకి వినియోగించే మామిడి రకాలు మార్కెట్లలో రకాన్ని బట్టి ధర నిర్ణయించ బడుతుంది. అయితే కొంతమంది మాత్రం ధరలు ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా మామిడి కాయల కొనుగోలుకు వినియోగదారులు ప్రాధాన్యమిస్తున్నారు. తర్వాత వాటిని తమకు కావాల్సిన సైజులో ముక్కలు కోయించుకుని ఇళ్లకు తీసుకువెళుతున్నారు. కానీ గతంలో వంద కాయలతో ఊరగాయ తయారు చేసుకుని తెలుగు లోగిళ్ల ప్రస్తుతం సగానికే పరిమితమవుతున్నారు.

ఊరగాయ అంటే అందరికీ మక్కువే

జిహ్వాకు వహ్వా అనిపించే ఆవకాయ, ఎండు, పచ్చి మాగాయ, ఉల్లి ఆవకాయ, తదితర పచ్చళ్లు అంటే అందరూ ఇష్టపడతారు. కూర లేకపోయినా పర్వాలేదు నాలుగు పచ్చడి మెతుకులు తినొచ్చులే అనే భావనతో చాలామంది ఉంటారు. పచ్చళ్ల సీజన్ కావడంతో కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని ముఖ్య కూడళ్లలో ఎక్కడ చూసినా మామిడికాయలతో మార్కెట్లు కిటకిటలాడుతున్నా కొనుగోలు మాత్రం అంతంతమాత్రంగానే ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఆవకాయకు కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, హైదర్ సాబ్, దేశవాళీ రకాలతో పాటు మాగాయికి చెరుకు రసాలు, పెద్ద రసాలు రకాల మామిడికాయలను వినియోగిస్తుంటారు. పరిసర కొత్తపల్లి కొబ్బరి వంద కాయలు కాయ సైజును బట్టి రూ.500 నుంచి రూ.1,800 ధర పలుకుతుండగా, పెద్ద రసాలు రూ.800 నుంచి రూ.1000 వరకు, రసాలు రూ.800 నుంచి రూ.1000 వరకు, సువర్ణరేఖ, దేశవాళీ రకాల కాయలు రూ.600 నుంచి రూ.800 వరకు ఉన్నాయి.

ఊరగాయకు అవసరమైన సరకుల ధరలు రూపాయల్లో

సరకులు	గత ఏడాది ధర (కేజీల్లో)	ఈఏడాది ధర (కేజీల్లో)
ఆవకాయ కారం	420	800
మాగాయ కారం	310	650
గానుగ నూనె	320	450
వేరుశెనగ నూనె	180	290
ఆవాలు	150	220
మెంతులు	120	180
వెల్లుల్లి	100	150

వైభవంగా అమ్మవార్ల జాతర



చింతాలమ్మ తల్లి



ముత్యాలమ్మ తల్లి

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామ దేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ వార్ల జాతర సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, కాంతారా, శక్తి వేషాల నడుమ జాతర మహోత్సవం ఆద్యంతం కనుల పండువగా జరిపించారు. జాతరలో భాగంగా మంగళవారం అమ్మవార్లకు నైవేద్యాలు చెల్లించారు. బుధవారం అమ్మవార్ల తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

ఘనంగా చింతాలమ్మ తల్లి తీర్థం

అంబాజీపేట: మొసలపల్లిలో వేంచేసిన చింతాలమ్మ తీర్థంను ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆడపడుచులు అమ్మవారికి చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాత్రి అమ్మవారి పూజాఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

సీఎం జగన్‌కు ప్రజల మద్దతు

- కుందాలపల్లి, కేశనపల్లిలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు చిట్టిబాబు, వరప్రసాదరావు



కుందాలపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కేశనపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

పి.గన్నవరం: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌కి ప్రజలంతా మద్దతు పలుకుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కుందాలపల్లిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు పప్పుల రాంబాబు, పినిశెట్టి శ్రీను, కాట్రు వెంకటేశ్వరరావు, అంగ్రోతు వీవీ సత్యనారాయణ, పప్పుల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను జగన్ అమలు చేస్తున్నారని, అందుకే ప్రజలంతా ఆయన వెంట ఉన్నారని చిట్టిబాబు అన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, సర్పంచ్ కొంబత్తుల ఏసు, సాధనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అడుగూ అభివృద్ధి వైపే..

మలికిపురం: సీఎం జగన్ వేసే ప్రతి అడుగూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి వైపేనని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని కేశనపల్లిలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాపాక పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. వలంటీర్లు, అధికారులు, గృహసారథులు, కన్వీనర్లతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఏమేం పథకాలు అందుతున్నాయని వారిని ఆరా తీశారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు కావాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే స్తంభాలు వేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణస్వామి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుంకర బాబ్జి, అడబాల కృష్ణారావు, యడ్ల వెంకటరమణ, గుండుమేను నారాయణమూర్తి, సాధనాల రంగ, చింతా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటయోధుడు 'సలాది'



కొత్తపేటలో స్వామినాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

కొత్తపేట: మండల మాజీ ఎంపీపీ, రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు సలాది స్వామి నాయుడు చరిత్రలో నిలిచిపోయారని పలువురు అఖిలపక్ష నాయకులు అన్నారు. స్వామినాయుడు 19 వర్ధంతి పురస్కరించుకుని స్థానిక సంతోష్‌నగర్ వద్ద ఆయన తనయులు వెంకటేశ్వరరావు, రామకృష్ణ, బ్రహ్మాజీ ఆధ్వర్యాన మళ్లీ నెలకొల్పిన స్వామినాయుడి విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. మాజీ ఉప సర్పంచ్ సలాది రామకృష్ణ పిలుపు మేరకు అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, రాష్ట్ర కాపు నాయకుడు ఆకుల రామకృష్ణ, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు బండారు వెంకటసత్తిబాబు, మద్దూరి సుబ్బారావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని స్వామినాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎంపీపీ కార్యాలయం వద్ద స్వామి నాయుడి విగ్రహానికి ఎంపీపీ మార్గన గంగాధరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, పార్టీ నాయకుడు సలాది చిన్ని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దర్నాల రామకృష్ణ, ఉప సర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుబ్బల మూర్తి, బీజేపీ నాయకులు సంపథ కనకేశ్వరరావు, కోటిపల్లి దామోదర్, జనసేన నాయకుడు చిక్కం శివాజీనాయుడు, తులా రాజు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు చోట్ల స్వామినాయుడి విగ్రహాలకు వివిధ పార్టీ నాయకులు, కాపు యువత పూలమాల వేసి నివాళులర్పించారు.

ముంపు నుంచి తేరుకుంటున్న రైతులు



నగరంలో ముంపు నీటి నుంచి పనలు ఒడ్డుకు చేరవేస్తున్న రైతు



చిరతపూడిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

మామిడికుదురు: అకాల వర్షంతో పంట పొలాల్లో భారీగా ముంపునీరు నిలిచి పోయింది. దీంతో పంట పాడై పోకుండా మంగళవారం రైతులు చర్యలు చేపట్టారు. ముంపు నీటిలో తడిసిన పనల్ని ఒడ్డుకు చేరవేసి మొలకలు రాకుండా చర్యలు చేపట్టారు. మామిడికుదురు, నగరం, గెద్దాడ, లూటుకుర్రు, మామిడికుదురు తదితర గ్రామాల్లో రైతులు పంటను కాపాడుకునే చర్యల్లో నిమగ్నమయ్యారు. మండలంలో 2,957 ఎకరాల విస్తీర్ణంలో వరి పండించారు. కోత కోసిన సుమారు 100 ఎకరాల్లో పంట పనలపై ఉండిపోయింది. కుప్పలుగా వేసిన పంట మరో 200 ఎకరాలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మరో అయిదు రోజుల పాటు వర్షం ముప్పు పొంచి ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను కలవరపెడుతున్నాయి.

తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టాలి

అంబాజీపేట: ఇటీవల కురిసిన భారీ వర్షానికి తడిసిన ధాన్యాన్ని తక్షణమే ఆరబెట్టేలా రైతులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. చిరతపూడిలో వరి రాశులను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ తడిసిన ధాన్యం తేమ శాతం 18-20 శాతం ఉన్న వాటిని కొనుగోలు చేయాలని నాగేశ్వరరావును కోరారు. తడిసిన ధాన్యం రంగుమారే అవకాశం ఉన్నందున వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకునేలా చూడాలన్నారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ జిల్లా పౌర సరఫరాల శాఖ వారితో మాట్లాడి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దన్నారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏఈఓ డి.దుర్గారావు, వీఏఓ ఎం.రవితేజ, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్లు ఈ-కేవైసీ చేయించుకోవాలి

కొత్తపేట: ప్రభుత్వ పెన్షనర్లు అందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని స్థానిక తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు మేడిద సత్తిరాజు, ప్రధాన కార్యదర్శి అజ్జరపు వెంకటసుబ్బారావు సూచించారు. ఈ-కేవైసీ చేయించుకునే అంశంపై చర్చించేందుకు మంగళవారం స్థానిక సంఘ భవనంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. కొత్తపేట సబ్ ట్రెజరీ పరిధిలో 1620 మంది పెన్షనర్లు ఉండగా సుమారు 1100 మంది సంఘంలో సభ్యులుగా ఉన్నారన్నారు. వారిలో సుమారు 700 మంది ఈ-కేవైసీ చేయించుకోగా ఇంకా సుమారు 920 మంది ఈ-కేవైసీ చేయించుకోవలసి ఉందన్నారు. వారందరూ ఈ నెల 10 లోపు తప్పనిసరిగా సబ్ ట్రెజరీ కార్యాలయం నందు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలి



చొప్పెల్లలో చెరువుగట్టు ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీవో ముక్కంటి

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో చెరువుగట్టు ఆక్రమణదారులు సత్వరమే స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. చెరువుగట్టు ఆక్రమణల వల్ల వర్షాకాలం సమయంతో నీరు రహదారుల మీదే నిల్వ ఉండిపోతుందని గ్రామస్తుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన మంగళవారం గ్రామంలో పర్యటించారు. స్థానిక మహాలక్ష్మీ చెరువుగట్టు నుంచి పిల్లకాలువ గట్టు వరకూ ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. చెరువుగట్టుపై సత్వరమే సర్వేను నిర్వహించి ఆక్రమణలను గుర్తించాలని తహసీల్దార్ ఐపీ శెట్టిని ఆదేశించారు. అనంతరం ఆక్రమణదారులకు నోటీసులిచ్చి ఆక్రమణలను తొలగించాలన్నారు. సర్పంచ్ దంగేటి చంద్రకళ, ఉప సర్పంచ్ సుంకర కామరాజు, కార్యదర్శి ఎం.శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



పెదపళ్లలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణురాలు

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యారోగ్య సిబ్బందికి, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. ఏప్రిల్ నెలలో సాధించినవలసిన ప్రగతిని, మే నెలలో చేపట్టవలసిన కార్యక్రమాలను అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ పాల్గొన్నారు. మండలంలోని పెదపళ్లలోని ఎస్‌బీపీబీకే కమ్యూనిటీ హాలులో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం జరిగింది. కంటి వైద్య నిపుణురాలు పి.లక్ష్మి విచ్చేసి సుమారు 120 మందికి పరీక్షలు ఉచితంగా మందులను అందజేశారు. అవసరమైన రోగులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. ఏఎన్ఎం సీహెచ్ ఉమా మహేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి ఆర్డీవో ప్రత్యేక పూజలు



అంతర్వేది ఆలయంలో ఆర్డీవో వసంతరాయుడు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం అమలాపురం ఆర్డీవో బి.వసంతరాయుడు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు తెలిపి, ప్రసాదం, స్వామి చిత్ర పటంను అందజేశారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ఆలయ భూములపై అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రిలతో ఆర్డీవో సమీక్షించారు. దేవస్థానం భూముల గురించి వివరాలు ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. వీఆర్వో బొల్లాప్రగడ సీతారామం పాల్గొన్నారు.

రైతన్నకు చేదోడుగా ఉపాధి హామీ



పేరవరంలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాతిబుజ్జి తదితరులు

ఆత్రేయపురం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు ఆత్రేయపురం మండలంలో వివిధ గ్రామాల్లో అకాల వర్షాల కారణంగా నీట మునిగిన పంటను కాపాడడానికి చేలల్లో ఉన్న నీటిని తొలగించేందుకు పంట బోదెలను ఉపాధి హామీ వేతనదారుల ద్వారా శుభ్రం చేయించినట్లు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. పేరవరంలో సర్పంచ్ గంటి విజయభారతి, స్థానిక రైతులతో కలిసి పరిశీలించిన అనంతరం ఉపాధి హామీ వేతనదారులను అనుసంధానం చేసి వర్షపు నీటిని పొలాల నుంచి బయటకు వచ్చేలా చేశారు. అలాగే గ్రామ సచివాలయ భవనంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి వచ్చే సమాచారం ప్రజలకు, రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ, పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తుని రైలు దహనం కేసు కొట్టివేతపై హర్షం

మలికిపురం: కాపు రిజర్వేషన్ల పోరాటంలో జరిగిన తుని రైలు దహనం కేసును రైల్వే కోర్టు కొట్టి వేయడంపై పలువురు కాపు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని లక్కవరంలో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని ఈ సంఘటనలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంపై కేసు కొట్టి వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర పూరితంగా వ్యవహరించి ముద్రగడ, కాపులపై తప్పుడు కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. న్యాయవాది మంగెన సింహాద్రి, అడబాల బ్రహ్మాజీ, వీరా మల్లిబాబు, బండారు కాశి, బి.భగవాన్, సూరిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: తునిలో రైలు దహనం కేసును విజయవాడ రైల్వే కోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇవ్వడం హర్షణీయమని కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు కల్వకొలను తాతాజీ అన్నారు. మండలంలోని ఇసుకపూడిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2016 జనవరి 31న కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో తునిలో నిర్వహించిన భారీ బహిరంగ సభ అనంతరం జరిగిన అల్లర్ల ఘటనలో గుర్తు తెలియని వ్యక్తులు రైలును దహనం చేశారన్నారు. దీనితో ఎటువంటి సంబంధం లేని నాయకులు నల్లా విష్ణుమూర్తితో పాటు 41 మందిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారన్నారు. 24 మంది సాక్షుల్లో 20 మందిని విచారించిన కోర్టు కేసును కొట్టివేస్తున్నట్టు ప్రకటించిందన్నారు. ఆర్థికంగా, విద్యా, ఉద్యోగాల పరంగా వెనుకబడిన కాపులను బీసీల్లో చేర్చాలని.. ఆనాడు తునిలో చేపట్టిన బహిరంగ సభ సందర్భంగా జరిగిన అల్లర్లలో తమపై అన్యాయంగా కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడేళ్ల అనంతరం కాపు ఉద్యమ నాయకులకు న్యాయం జరిగిందని తాతాజీ హర్షం వ్యక్తం చేశారు. కాపు సంఘాల నేతలు పాల్గొన్నారు.

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

పి.గన్నవరం: తునిలో రైలు దహనం ఘటన కేసును రైల్వే కోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని స్థానిక కాపు సంక్షేమ సంఘ నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ అన్నారు. రైలు దహనం కేసుతో కాపు ఉద్యమ నాయకులకు ఏ మాత్రం సంబంధం లేదని ఆయన అన్నారు.

చోరీలు అరికట్టేందుకు ఎల్‌హెచ్‌ఎం సిస్టం



కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరాల గురించి వివరిస్తున్న డీఎస్పీ రమణ

కొత్తపేట: నివాసితులు ఎప్పుడైనా, ఎక్కడికైనా వెళ్లవలసిన సందర్భంలో దొంగతనాలు జరగకుండా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా పోలీసు రక్షణ కల్పిస్తామని స్థానిక డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గృహస్తులు తమ ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లవలసినప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా ఒక రోజు ముందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వారి ఇంట్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. దీని ద్వారా ఇంటిని ఎల్లప్పుడూ పోలీస్ పర్యవేక్షణలో ఉంచుతూ ఎటువంటి దొంగతనాలు, నేరాలు జరగకుండా రక్షణ కల్పిస్తామన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ కొరకు గూగుల్ ప్లే స్టోర్లో ఏపీ పోలీస్ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ డౌన్లోడ్ చేసుకుంటే రిజిస్టర్ చేసుకున్నా లేదా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి ఎల్‌హెచ్‌ఎంఎస్ కు సంబంధించి సీసీ కెమెరా, వైఫై పరికరాలను ఆ ఇంట్లో అమర్చి పోలీస్ రక్షణ సర్వీస్ కల్పిస్తామన్నారు. ఎవరైనా చోరీకి పాల్పడేందుకు ఆ ఇంట్లో ప్రవేశిస్తే వాళ్లను ఆ సీసీ కెమెరా గుర్తించి, వైఫై ద్వారా పోలీస్ హెడ్ క్వార్టర్‌కు వెళ్లి అక్కడి నుంచి స్థానిక స్టేషన్‌కు సమాచారం రావడంతో వెంటనే ఆ చోరీ ప్రయత్నాన్ని అరికడతామని వివరించారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే వారు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ రమణ సూచించారు. సమావేశంలో సీఐ ఎస్.రజనీకుమార్, ఎస్సై వి.మణికుమార్ పాల్గొన్నారు.

మూతపడిన ఇటుక బట్టీలు



జొన్నాడలో వర్షాల వల్ల మూసివేసిన ఇటుకబట్టీ

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గత మూడు రోజుల నుంచి విపరీతమైన వర్షాలు కురవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు ఇటుక బట్టీ కార్మికులు ఉపాధి కోల్పోయారు. మండలంలోని సుమారు 600 బట్టీలు మూతపడి సుమారు పది వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. వర్షాల ధాటికి బట్టీ కళ్లాలన్నీ తడిసిపోవడంతో మరో వారం రోజుల వరకూ పనులు లేని పరిస్థితి. అలాగే ఈదురుగాలులకు, వర్షాలకు కప్పిన బరకాలు ఎగిరిపోయి పచ్చి ఇటుక తడిసిపోవడంతో యజమానులు తీవ్రంగా నష్టపోయారు. అసలే పెరిగిన ముడి సరకుల ధరలతో ఇబ్బందులు పడుతున్న ఇటుక బట్టీ యజమానులకు ఈ అకాల వర్షాలు తీరని వేదనను మిగిల్చిందని వాపోతున్నారు. దీనివల్ల ఇటుక ధర పెరిగే ప్రమాదముందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. మండు వేసవిలో కురిసన వర్షాలు వల్ల వ్యవసాయం, ఇటుక పరిశ్రమ చిన్నాభిన్నమై ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని మండల వాసులు ఆందోళన చెందుతున్నారు.